# చేతులు కాలాక....

—కోపూరి పుష్పాదేవి

ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ పైడి రాజు ఆవేళ నిద్రలేస్తూ ఎవరిముఖం చూశాడో ఏమో ఆరోజంతా అతనికి చికాకు కలిగిస్తూనే ఉంది.

పొద్దున్నే ఇంట్లో భార్యతో గొడవ తర్వాత ఇంటిగలాయనతో పోట్లాట, ఆ తర్వాత స్టేషన్ లో యస్.ఐ.చేత చివాట్లు. ఆ చికాకుతోనే తను డ్యూటీ చెయ్యాల్సిన సెంటర్ కొచ్చి నిలబడ్డాడు. అందరికీ తనే లోకువ అనుకుంటూ.

నుట్టమధ్యాహ్నం పైన నెత్తి మాడుతోంది. ఆకలికి కడుపు నకనకలాడుతోంది. అందరిచేత చివాట్లు తినడం వల్ల మనసు మండుతోంది.

కడుపులోని కక్షనంతా ఎవరిమీద వెళ్ళగక్కాలో తెలియక, విసుగ్గా నిలబడి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న పైడిరాజుదగ్గరకు పది, పన్నెండేళ్ళ కుర్రాడొకడు వచ్చాడు ఓ ఏడాది పాపనెత్తుకుని. "ఈ పాపొక్కతే రోడ్డుమీద వస్తోంది. ఏ సైకిల్ కిందో, స్కూటర్ కిందో పడిపోతుందేమోనని తీసుకొచ్చానండి" అంటూ ఆ పాపను పైడిరాజుకి అందివ్వబోయాడు.

"అయితే నన్నేంచెయ్యమంటావురా ఈ పిల్లనెత్తుకుని. ప్రతివీధీ తిరగమంటావా "ఈపిల్ల మీపిల్లా? మీపిల్లా....? అనడుగుతూ" అంటూ గద్దించాడు పైడిరాజు.

అసలే అమాయకంగా ఉన్న ఆ కుర్రవాడు పైడిరాజు గద్దింపుకి హడలిపోయాడు. ఆ చిన్నపాపనేం చేయాలో తోచక, దిక్కులు చూస్తూ నిలబడిపోయాడు.

ఇంతలో ముగ్గురువ్యక్తులు అటుగా వచ్చారు. ఆ కుర్రవాడిచేతిలోని పాపని చూసి పాప క్షేమంగా ఉన్నందుకు సంబరపడిపోయారు. ఇంతలో వారికి గుర్తు వచ్చింది పాప మెడలో కాసున్నర బంగారుగొలుసు ఉండాలని. ఆత్రంగా పాపమెడలో చూశారు. గొలుసు లేదు. అప్పుడు అందరి చూపులూ పిల్లవాడి వేపు తిరిగాయి.

"ఏరా! నువ్వెవరు? పాపనెందుకు ఎత్తుకున్నావు? గొలుసేం చేశావు" అంటూ గద్దించారు.

అసలే పైడిరాజు గద్దింపుకు బిక్కచచ్చి ఉన్న ఆ కుర్రవాడు వీళ్ళందరి ప్రశ్నలకు హడలిపోయాడు. ఎలాగో ధైర్యం కూడగట్టుకుని, "మాదీ ఊరు

ఉదండి. మా పిన్నీ, బాబాయ్ ఊరెళ్ళి న్నారండి. వాళ్ళింటికోసం వెతుకుతుంటే ఈపాప రోడ్డుమీద నడుస్తూ కన్పించిందండి. ఏ బండికిందైనా పడిపోతుందో ఏమోనని ఎత్తుకుని ఎవరి పాప అని వెతుకుతున్నానండి. ఎవరూ కనిపించకపోతే ఈ పోలీసుగారికిద్దామని వచ్చానండి. ఇంతలో మీరొచ్చారు" అన్నాడు.

"కథ బాగానే అల్లావురా కుర్రోడా గొలుసు కాజేశావు గానీ పిల్లనెలా వదిలించుకోవాలో తెలియలేదు. గొలుసెక్కడ పెట్టావో బయటికితియ్" అంటూ పైడిరాజు ఆ కుర్రవాడి చొక్కా, నిక్కరు జేబుల్లో వెతికాడు. గొలుసు లేదు.

"నిజంగానేనండి. నాకు తెలీదండి, మా అమ్మమీద ఒట్టండి" అంటున్న ఆ కుర్రవాడిమాట పూర్తవకుండానే చెంప మీద చెయ్యి పడింది, ఆ వెంటనే వరసగా వీపుమీద, తలమీద దెబ్బలు, గుద్దులు, దెబ్బలధాటికి తట్టుకోలేని ఆ కుర్రవాడు సింహాలమధ్య చిక్కుకున్న లేడికూనలా ఓపికున్నంతవరకూ దెబ్బలు తిని, ఇక భరించలేక కళ్ళుతిరిగి మైకం కమ్మి స్పృహతప్పికుప్పకూలిపోయాడు

క్రింద పడిపోయిన ఆ కుర్రవాడు చచ్చాడో, బతికాడో పైడిరాజు చూడలేదు. అతని డ్యూటీ అయిపోవడంతో మరొకరికి డ్యూటీ అప్పచెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు.

మర్నాడు పైడిరాజుకి అతని వదిన దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. "చాలా సంవత్సరాలతర్వాత వ్రాసిందే ఏమిటో సంగతులు అనుకుంటూ ఉత్తరం చదివాడు.

ఇక్కడ నా పరిస్థితులు బొత్తిగా బాగుండని కారణంగా పెంపకానికి తీసుకున్న మీ అబ్బాయికి తిండికూడ పెట్టలేకపోతున్నాను. అందువల్ల వాడిని తిరిగి మీవద్దకు పంపివేశాను, ఈపాటికి క్షేమంగా చేరాడని తలుస్తాను. మా చెల్లిని అడిగానని చెప్పు.

ఇట్లు, మీవదిన.
లక్ష్మీనరసమ్మ

పైడిరాజుకి చప్పున నిన్నటి కుర్రవాడు గుర్తువచ్చాడు. ఏదోమాటపట్టింపు వచ్చి ఏడెనిమిదేళ్ళనుంచి రాకపోకలు లేకపోవటంమూలంగా తను గుర్తించలేదుగానీ, ఇప్పుడు ఆలోచిస్తుంటే ఆ కుర్రవాడిలో తన భార్య పోలికలున్నట్లు తోచింది పైడిరాజుకి.

"ఎంత పనయిందిరా భగవంతుడా" అనుకుంటూ కుప్పకూలిపోయాడు పైడిరాజు.

★

లవ్ స్టోరీ:

"ఏం రా నీ లవ్ ఎఫైర్ ఎంతవరకూ వచ్చింది" మిత్రుడితో.

"ఫిఫ్టీ పర్సెంట్ సక్సెస్"

"అంటే"

"నే చూస్తున్నాగానీ ఆమె యింకా నావేపు చూడటం బిగిన్ చేయలేదు"

—మంత్రవాది మహేశ్వర్